తీరనున్న విద్యుత్ కష్టాలు

- రూ.2.80 కోట్లతో నిడమర్రులో నూతన సబ్‌స్టేషన్
- నేడు ఎమ్మెల్యే వాసుబాబుతో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- మండలంలో తొలగనున్న విద్యుత్ సరఫరా సమస్యలు


నిడమర్రులో నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్ భవనం


11 కేవీ విద్యుత్ సరఫరా ఫీడర్లు, ఇతర పరికరాలు

నిడమర్రు: మండలంలో దశాబ్దకాలంగా ఏర్పడిన విద్యుత్ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మండల కేంద్రం నిడమర్రులో రూ.2.80 కోట్లు అంచనా వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ కెపాసిటీ గల విద్యుత్ ఉప కేంద్రం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. దీంతో మండలంలోని 16 గ్రామాలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా అందించేందుకు వీలు కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ మండల ఏఈ మురళీకృష్ణ తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.80 కోట్లు, నూతన స్తంభాలు లైన్లు నిర్మాణాలకు మరో రూ.60 లక్షలు నిధులు వెచ్చించినట్లు ఏఈ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేతుల మీదుగా ఈ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు.

ఆక్వాతో పెరిగిన విద్యుత్ వినియోగం

మండలంలో ఆక్వా పరిశ్రమ అభివృద్ధితో విద్యుత్ వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. ప్రధానంగా రొయ్యి సాగులో ఏరియేటర్ల వినియోగంలో విద్యుత్ కనెక్షన్ పెరుగుతుండటం, ఏసీలు, ఫ్రిజ్‌లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలతోపాటు, కమర్షియల్ విద్యుత్ వినియోగం సైతం పెరుగుతూ వస్తోంది. గతంలో మండలంలోని 16 గ్రామాలతోపాటు గణపవరం గ్రామానికి సైతం విద్యుత్ సరఫరా కేవలం బువ్వనపల్లి సబ్‌స్టేషన్ నుంచే జరిగేది. గణపవరం మండలం సరిపల్లి సబ్‌స్టేషన్ నిర్మాణం, పెదనింద్రకొలనులో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణాలతో బువ్వనపల్లి సబ్‌స్టేషన్‌పై ఒత్తిడి కొంతమేర తగ్గింది. బువ్వనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ ఫీడర్లు 5 ఉండటంతో మండలంలోని 10 గ్రామాల్లో ఇంకా రాత్రి వేళల్లో రోజుకు 2 గంటల చొప్పున లోడ్ రిలీఫ్ కింద అధికారులు విద్యుత్ సరఫరా నిలుపుదల చేసేవారు. నిడమర్రులో ఈ నూతన సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే ఆ పరిస్థితి ఉండదని పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేసేందుకు అవ కాశం కలుగుతోందని ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

క్రొవ్విడి, తోకలపల్లిలో..

మండలంలో భవిష్యత్ విద్యుత్ అవసరాలు దృష్టిలో ఉంచుకుని వేసవిలో సైతం ఎటువంటి కోతలు లేకుండా పూర్తిస్థాయి విద్యుత్ సరఫరా చేసేందుకు క్రొవ్విడి, తోలకలపల్లి గ్రామాల్లో 11కేవీ నూతన విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణాలకు ఇప్పటికే స్థలాలు కేటాయించి నిధులకోసం నివేదికలు పంపించినట్లు ఏఈ మురళీకృష్ణ తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో సబ్‌స్టేషన్ నిర్మాణాలకు మరో రెండు నెలల్లో అనుమతులు వస్తాయన్నారు. దీంతో మండలంలోని 16 గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో ఎటువంటి సమస్యలు ఉండవని అధికారులు తెలిపారు.

జోరుగా ఉపాధి పనులు


పెదలింగంపాడులో మంచినీటి చెరువు పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు

భీమడోలు : మండలంలో జాతీయ ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. కోడూరుపాడు, కోరుకొల్లు పంచాయతీల మినహా మిగిలిన 11 గ్రామ పంచాయతీల్లో మంచినీటి చెరువు పూడిక తీత, పశువుల చెరువుల పూడిక, పంట కాల్వలు, డ్రైయినేజ్ పూడిక తీత వంటి తదిర పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. భీమడోలు పంచాయతీ శివారు పెద్దలింగంపాడులో మంచినీటి చెరువు పూడికతీత పనులు చేపట్టారు. అలాగే పశువుల దాహార్తిని తీర్చే తిమ్మన చెరువులో గుర్రపు డెక్కను తొలగిస్తున్నారు. మండలంలోని గురువారం ఒక్క రోజే 2116 మంది కూలీలు 23 పనులు చేశారు. గత వారం రోజులుగా 2వేల నుంచి 2200 వరకు సరాసరి కూలీలు పనులు చేపడుతున్నారు. ప్రతి రోజు కూలి సొమ్ము గరిష్టంగా రూ.270 వరకు కూలీలకు జమ అవుతుందని ఎంపీడీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్ తెలిపారు.

క్లుప్తంగా

భూసర్వేతో వివాదాలకు చెక్


డ్రోన్‌ద్వారా భూసర్వే ప్రారంభిస్తున్న దృశ్యం

గణపవరం: జగనన్న భూసర్వేతో భూవివాదాలకు చెక్ పడుతుందని, ఈ సర్వేను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము అన్నారు. గురువారం గణపవరం మండలం అర్ధవరం, కొత్తపల్లి, వరదరాజపురం గ్రామాలలో జగనన్న భూహక్కు– భూరక్ష కార్యక్రమంలో డ్రోన్ సర్వే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఏళ్లతరబడి ఉన్న భూవివాదాలకు భూసర్వే ముగింపు పలుకుతుందన్నారు. రైతులు తగిన పత్రాలను సమర్పించి తమ హద్దులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భూమికి సరిహద్దులు నిర్ణయించి, సర్వే రాళ్లు వేస్తామని, కొత్తహక్కు పత్రాలు మంజూరుచేస్తామన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి


ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్ లక్ష్మి

గణపవరం: ఆధార్‌కార్డు కలిగిఉన్న ప్రతి ఒక్కరూ తమ కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని గణపవరం తహసీల్దార్ పమ్మి లక్ష్మి అన్నారు. గురువారం అర్ధవరంలో నూతన ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పదేళ్ల నిండిన ఆధార్ కార్డును తప్పక అప్‌డేట్ చేయించాలన్నారు. మండలంలో గణపవరం, పిప్పర, అర్ధవరం, కేశవరం, చిలకంపాడు గ్రామాలలో ఐదు శాశ్వత ఆధార్‌నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎంపీపీ అర్ధవరం రాము మాట్లాడుతూ ప్రజలకు ఎంతో ఉపయోగపడే ఆధార్‌కార్డులో తప్పులుంటే ఈకేంద్రాలలో సరిచేసుకునే అవకాశం ఉందన్నారు.

రమణబాబుకు పరామర్శ


రమణబాబును పరామర్శిస్తున్న పలువురు నేతలు

నిడమర్రు : రాష్ట్ర బీసీ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకట రమణబాబు తల్లి నౌడు సత్తెమ్మ ఇటీవల మృతి చెందారు. వివిధ పార్టీల నేతలు, బీసీ సంఘాల నేతలు రమణబాబును పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. వీరిలో వైఎస్సార్ సీపీ నరసాపురం నియోజకవర్గం పరిశీలకులు ఘంటా ప్రసాదరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కర్రి వేణు మాధవ్, బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాసు, మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు, బీసీ వర్గాల జాతీయ అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి మంత్రబుడ్డి అప్పారావు తదితరులున్నారు.

సచివాలయం తనిఖీ

పెదవేగి : ప్రజాసమస్యలు పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి, ప్రజలకు అందుబాటులో ఉండాలని గ్రామ సచివాలయం అధికారులను ఎంపీడీవో రాజ్‌మనోజ్ ఆదేశించారు. గురువారం పెదవేగి మండలం కవ్వకుంటలోని గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో ఆకస్మికంగా పరిశీలించారు. పారిశుద్ధ్యం, చెత్త నుంచి సంపద కేంద్రం నిర్వహణ, మంచినీటి సరఫరా తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో మూగజీవాలకు మంచినీరు అందించాలని సిబ్బందిని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంను సందర్శించి అంగన్‌వాడీ చిన్నారులతో మాట్లాడారు. జ్వరాలపై జరుగుతున్న సర్వేపై ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల పనితీరు వంటి అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామసచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు బావాయిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం

నిడమర్రు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నియోకవర్గంలో 143వ రోజు, బావాయిపాలెంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. దీనిలో భాగంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆయా కార్యక్రమాలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరవుతారని పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తెలుగు పండిట్‌కు సత్కారం

దెందులూరు: ఆధ్యాత్మిక, విద్య, వైద్య సేవా రంగాల్లో విశిష్ట సేవలందించిన రిటైర్డ్ తెలుగు పండిట్ షేక్ ఫజ్లుల్ రహమాన్ అభినందనీయులని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. గురువారం దెందులూరులో రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఇచ్చిన ముతవల్లి పదవి రహమాన్ సేవలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. స్థలాన్ని, మసీదును వక్ఫ్ బోర్డుకు దానం చేసి ఆయనలోని ఆధ్యాత్మిక చింతనను నిరూపించుకున్నారన్నారు. ఆయన సేవలకు ముతవల్లి పదవి సరైన బహుమానంగా అభివర్ణించారు.

బాలబాలికల సంక్షేమానికి కృషి


ఆగడాలలంకలో విద్యార్థులకు స్టీలు గ్లాసులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ కనమాల రామయ్య

భీమడోలు : బాలబాలికల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. ఆగడాలలంకలోని సీబీసీఎన్‌సీ ప్రాథమిక పాఠశాల, అన్నేవారిగూడెం యూపీ పాఠశాలల్లో గురువారం చిన్నారులకు స్టీలు గ్లాసులను పంపిణీ చేశారు. ఆగడాలలంకలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ కనమాల రామయ్య మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 4867 మంది విద్యార్థులకు, సీబీసీఎన్‌సీ పాఠశాలలో 70 మంది విద్యార్థులకు స్టీలు గ్లాసులను అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గోరుముద్ద పథకంలో బాలబాలికలకు బలవర్ధకమైన పోష్టికాహారాన్ని అందించేలా తగు చర్యలు తీసుకున్నారన్నారు. చిన్నారుల్లో ఐరన్ లోపం, రక్త హీనత వంటి రుగ్మతల నివారణకు కోడిగుడ్లు, చిక్కీలు, రాగి జావలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. అన్నేవారిగూడెంలో సర్పంచ్ నీలం శ్రీనివాసరావు చేతుల మీదుగా 132 మందికి స్టీలు గ్లాసులను పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులకు స్టీలు గ్లాసుల్లో రాగిజావను అందించారు. కార్యక్రమంలో ఎస్‌కే మస్తాన్, టీచర్లు ఎంఎస్ఎస్ ఫణికుమార్, ఎస్.కనకదుర్గ, ఎం.విజయకుమారి, సాల్మన్, ఉదయ భాస్కర్ శివకుమార్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పోతుబోయిన మానిక తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ఏవీ గంగాధరరావు, ఎంపీడీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్

భీమడోలు : ప్రజల నుంచి వచ్చే స్పందన ఫిర్యాదులపై జగనన్నకి చెబుదాం అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టనున్నందున, ఈ కార్యక్రమానికి సచివాలయ ఉద్యోగులు చిత్తశుద్ధి అంకిత భావంతో పనిచేయాలని భీమడోలు మండల ప్రత్యేకాధికారి ఏవీ గంగాధరరావు అన్నారు. స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో గురువారం స్పందన ఫిర్యాదులు, హౌసింగ్, వ్యవసాయశాఖ, జాతీయ ఉపాధి హామీ పథకం, వైద్య ఆరోగ్య శాఖ, నాడు నేడు పనులు, ప్రభుత్వ భవన నిర్మాణ పనుల అమలు, వాటి పురోగతి తదితర అంశాలపై గురువారం ఎంపీడీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్‌తో కలిసి ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి ఏవీ గంగాధరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయంలో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందని, సంబంధిత అధికారులు అర్జీలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గత నెలలో 43 స్పందన ఫిర్యాదుల్లో 34 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్, పంచాయతీ రాజ్ ఏఈలు సీహెచ్ సతీష్, డి.సత్యనారాయణ, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దెందులూరు ఏఎంసీకి నూతన పాలకవర్గం

చైర్మన్‌గా అప్పన్న ప్రసాద్


సీఎం జగన్‌కు కృతజ్ఞతలు చెబుతున్న చైర్మన్ అప్పన్న ప్రసాద్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి (ఫైల్)

దెందులూరు: దెందులూరు ఏఎంసీ (వ్యవసాయ మార్కెట్ కమిటీ) నూతన పాలకవర్గం కొలువుతీరింది. ఏపీ మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి 20 మందితో కూడిన దెందులూరు ఏఎంసీ పాలకవర్గాన్ని నియమిస్తూ లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీ ఒక సంవత్సరం పాటు అధికారంలో ఉంటుంది.

పాలకవర్గం ఇదే: వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా అప్పన కనకదుర్గా ప్రసాద్, వైస్ చైర్మన్‌గా కాటి సుధాకర్, మెంబర్లుగా కంభంపాటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొసరాజు రత్నకుమారి, దేవల రాజశేఖర రావు, నాగులపల్లి రంగారావు , పామర్తి నాగజ్యోతి, తోట హేమలత, బోడవరపు నళిని కుమారి, పులిపాటి శ్యామలాదేవి, కొండే జోజిలత, ఆవాల లీలావతి, కట్నేని తులసిరామ్, పసుపులేటి రాజేష్, పెదపాడు కోఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ ఆఫీసర్, వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్, గోపన్నపాలెం సర్పంచ్‌లను నూతన పాలక వర్గంగా నియమించారు.

ఏఎంసీ ఆవిర్భావం

దెందులూరు ఎఎంసీ, ఏలూరు ఎఎంసీ నుంచి 2007లో విడిపోయి ఏర్పాటైంది. ప్రస్తుతం ఇది 5వ పాలకమండలి, ఎఎంసీలో దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాలున్నాయి. 42738.24 హెక్టార్లల్లో మొక్కజొన్న, ధాన్యం, రొయ్యలు, చేపలు, అపరాలు తదితర వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెట్ ఫీజు వసూలు చేయడం దెందులూరు ఎఎంసీ ప్రధాన నిర్వహణ. మొత్తం ఐదు చెక్‌పోస్టులున్నాయి.

ఎమ్మెల్యే, సీఎంలకు రుణపడి ఉంటా: ప్రసాద్

దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు రుణపడి ఉంటా.దెందులూరు ఏఎంసీని అభివృద్ధి పథంలో నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తామన్నారు.

ఏఎంసీ చైర్మన్ ప్రసాద్‌కు సత్కారం

ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన అప్పన ప్రసాద్‌ను గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు ఘనంగా సత్కరించారు. అందరికీ పదవుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్ర రావులకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తులసీరామ్, వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు


బావాయిపాలెంలో జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్ గోడకు అతికిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గురువారం బావాయిపాలెం గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే వాసుబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. లబ్ధిదారుల ఇంటికి జగనన్నే మా భవిష్యత్ స్టికర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా సంక్షేమ ఫలాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు మద్దతు తెలుపుతూ మరోసారి పార్టీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. సుమారు 120 గడపల వరకూ వెళ్లి కరపత్రాలు అందించి వారు ప్రభుత్వం తరుపున పొందుతున్న ఆర్థిక సహకారం, సేవలను ఎమ్మెల్యే వాసుబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జ్ పుప్పాల కన్నబాబు, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ కోడే కాశి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, మండల సచివాలయాల కన్వీనర్ నౌడు అచ్యుతరామారావు, వైస్ ఎంపీపీ సమయం వీరరాఘవులు, సర్పంచ్ ముత్యాల సుజాత బాలాజీ, ఎంపీటీసీ ముత్యాల సుబ్బలక్ష్మి సుబ్బారావు, గ్రామపార్టీ అధ్యక్షులు నాగిశెట్టి సుబ్బయ్య, రైతు నాయకులు గొట్టుముక్కల విశ్వనాథరాజు, మాజీ ఎంపీటీసీ బొబ్బిలి వెంకటేశ్వరరావు, పుప్పాల శ్రీనివాసు, దారాబత్తుల సత్రయ్య, సంకు పద్మాకర్, తోట పెదకాపు, బొబ్బిలి సోమేశ్వరరావు, బొబ్బిలి త్రిమూర్తులు, ముత్యాల మురళి, సర్పంచ్‌లు పుప్పాల మేరీ, ఝాన్సీ, పొట్నూరి ఉమా, ఎంపీడీవో పీవీవీ ప్రసాద్ తదితరులున్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు బ్రహ్మరథం


ఎంఎంపురంలో బుక్‌లెట్లు అందజేస్తున్న ఎంపీటీసీ గంటా శ్రీనివాస్, పార్టీ శ్రేణులు

భీమడోలు : మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు, ఎంపీటీసీ గంటా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గృహ యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి నాగరాజు, సచివాలయ కన్వీనర్ పెట్ల ఇశ్రాయేలు, గృహసారథులు చిన్నం మహేష్, ఇంజేటి పుష్ప, నాయకులు పుప్పాల యేసుబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


జగనన్నే మా భవిష్యత్తు సర్వే నిర్వహిస్తున్న పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు: పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. గురువారం మేధినరావుపాలెంలో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు మేడికొండ వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ దుర్గా కుమారి రాజు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. కామిరెడ్డి నాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. ప్రతి ఇంటికి జగనన్న స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు, వలంటీర్లు ఉన్నారు.

గడప గడపలో మా నమ్మకం నువ్వే జగన్

పెదవేగి : గడప గడపలో మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ఒక్కటే నినాదం మార్మోగుతుంది. దెందులూరు శాసనసభ్యులు కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు పెదవేగి మండలంలోని అన్ని గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం బాపిరాజుగూడెం పంచాయతీ పరిధిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నేత వీరమాచినేని నాగబాబు అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ పాలన ఏ విధంగా ఉందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం నుంచి ఏ విధమైన పనులు కావాలనే విషయాలను నమ్మకాలపై పూర్తి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే దుగ్గిరాల, రాయన్నపాలెం గ్రామాల్లో కూడా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

నిడమర్రు : మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. క్రొవ్విడి గ్రామంలోని మసీదులో గురువారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జ్ పుప్పాల కన్నబాబు, జిల్లా వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ డాక్టర్ కమీల్ జామ, జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి శ్రీనివాసు, కన్వీనర్లు సంకు సత్యకుమార్, నౌడు అచ్యుతరామారావు, పార్టీ అధ్యక్షులు ధనుకొండ బుజ్జి, ఆర్‌బీకే చైర్మనర్ షకీల్ రహ్మాన్, మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ. సలీమ్, వాకమూడి అప్పారావు తదితరులున్నారు.

ముమ్మరంగా ధాన్యం ఎగుమతులు

ఉంగుటూరు : ధాన్యం ఎగుమతులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉంగుటూరు మండలంలో 1లక్షా 15 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం పండించగా సుమారుగా 28 లక్షలు సంచులు అవసరమవుతాయని అంచనా. ఇప్పటికి 5 లక్షల సంచులను సరఫరా చేశారు. ఏలూరు జిల్లాలో ధాన్యం అధికంగా ఎగుమతి అయ్యేమండలాల్లో ఉంటుటూరు మండలం ఒకటి. దీంతో జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల నారాయణపురంలో జరిగిన స్పందనలో కూడా రైతులు సంచులు, లారీలను అధికంగా కేటాయించమని కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కూడా అధికార యంత్రాంగంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు. దీంతో సంచులను సమకూరుస్తున్నారు. రైతులు, కౌలు రైతులు సంచులు తెచ్చుకోవడం, పట్టుబడులు పెట్టడం , లారీల్లో ధాన్యం తరలించడం పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

ఉంగుటూరు: ఉంగుటూరు శివారులో జరగుతున్న క్రికెట్ పోటీలు 7వరోజు కొనసాగాయి. రెండో లీగ్‌లో బాదంపూడి – పూళ్ల జట్ల మధ్యపోటీ జరగగా పూళ్ల వారియర్స్ జట్టు విజయం సాధించింది. కైకరం – భువనపల్లి జట్లు మధ్య జరిగిన మ్యాచ్‌లో కైకరం జట్టు, చేబ్రోలు – కైకరం జూనియర్ జట్ల మధ్య జరిగిన పోటీలో చేబ్రోలు జట్లు విజయం సాధించాయి. రేపటినుంచి మూడవ లీగ్ మ్యాచ్‌లు జరగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నేడు మండల స్థాయి సమీక్ష

పెదపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారుల సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నిర్మలజ్యోతి తెలిపారు. మండల ప్రత్యేక అధికారితో పాటు నియోజకవర్గ ప్రత్యేకాధికారి సమీక్షలో పాల్గొంటారన్నారు.

వామపక్షాల 'ప్రచార భేరి'


మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై వేగివాడలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పెదవేగి : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలన ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వామపక్షాలు గురువారం పెదవేగి, ముండూరు, లక్ష్మీపురం, వేగివాడ గ్రామాల్లో ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. మోడీ ప్రభుత్వానికి గద్దెదించండి, దేశాన్ని కాపాడండి అంటూ నినాదాలు చేస్తూ విస్తృతంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ముండూరులో ఆరబెట్టిన మొక్కజొన్న పంటను సీపీఎం, సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్, బండి వెంకటేశ్వరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఎ. శ్యామలా రాణి, సీపీఐ జిల్లా నాయకులు పొటేలు పెంటయ్య సీపీఎం, సీపీఐ పార్టీల కార్యకర్తలు ఆయా గ్రామాల్లో రైతులు ప్రజలు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధన ద్వారానే అభివృద్ధి

దెందులూరు: ప్రత్యేక హోదా సాధన ద్వారానే రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పీ. శ్రీనివాసరావు అన్నారు. గురువారం సోమవరప్పాడులో కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ప్రచార భేరీ యాత్రను నిర్వహించారు. అనంతరం గోపన్నపాలెం, గాలాయగూడెం, నాగులదేవునిపాడు, గంగన్నగూడెం, మేధినరావుపాలెం, శ్రీరామవరం, దెందులూరు, పోతునూరు, కొవ్వలి, దోసపాడు గ్రామాలు మీదుగా యాత్ర సాగింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులు ఇవ్వాలని, ప్రత్యేక హోదా వెంటనే మంజూరు చేయాలని, పెంచిన గ్యాస్, పెట్రోలు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఏ.శ్యామలారాణి, సీపీఐ జిల్లా నాయకులు పీ. పెంటయ్య, సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలున్నారు.